నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, సోమవారం 7 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

గజలక్ష్మి అవతారంలో అమ్మవారు

గజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీతాయారు అమ్మవారు

భద్రాచలం, అక్టోబర్ 6: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలోని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. మూడురోజులుగా ఉత్సవాలకు

నేడు ధనలక్ష్మి అలంకారం

భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. మూడోరోజు ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీలక్ష్మీతాయారు అమ్మవారు శ్రీగజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి స్నపన తిరుమంజనం గావించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేదపండితులు, అర్చకులు అయోధ్యకాండ పారాయణం చేశారు.

గజలక్ష్మి విశిష్టత..

గజలక్ష్మి అవతారంలో ఉన్న అమ్మవారిని ఆరాధిస్తే అధికారం, మహాసంపద కలుగుతాయని ప్రతీతి. గజలక్ష్మిని ఆరాధించే దేవేంద్రుడు త్రైలోకాధిపత్యాన్ని సాధించాడని, ఈ అమ్మను పూజిస్తే చెదరని అధికారం, తరగని సంపద కలుగుతాయని పండితులు ఉపదేశిస్తున్నారు.

నేడు ధనలక్ష్మి అవతారం..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రాద్రి దేవస్థానంలోని శ్రీలక్ష్మీతాయారు అమ్మవారు సోమవారం ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అమ్మవారికి ముస్లిం దంపతుల పూజలు

ఖమ్మం రూరల్, అక్టోబర్ 6: దుర్గామాత వేడుకల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం ఖమ్మంరూరల్ మండలంలోని నాయుడుపేటలో మతభేదాలకు అతీతమైన దృశ్యమొకటి కన్పించింది. నాయుడుపేటలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో అమ్మవారు శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడై ముస్లిం దంపతులు షేక్ సోందుబాబు, సైదాబీ.. మండపంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కులమత భేదం లేకుండా మనమంతా ఒకటేనని చాటిచెప్పిన సోందుబాబు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన వినాయకచవితి వేడుకల్లో సైతం సోందుబాబు దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేయడం విశేషం.

పూజల్లో పాల్గొన్న షేక్ సోందుబాబు దంపతులు

- భద్రాద్రి జిల్లాలో రెండో పంట సాగు విస్తీర్ణంపై సందేహాలు
- ప్రణాళికలో వెయ్యి ఎకరాలకు పైగా తగ్గించిన అధికారులు
- 'పెదవాగు' సహా పలు ప్రాంతాల్లో ప్రశ్నార్థకంగా 'యాసంగి'
- 'సన్నాలకు బోనస్' అంటూ చెప్పి మొహం చాటేసిన కాంగ్రెస్ సర్కారు
- 'రైతుభరోసా' రాక అప్పులతో నెట్టుకొచ్చిన అన్నదాతలు
- ఇప్పుడు యాసంగికి ఇచ్చే పెట్టుబడి సాయంపైనా అనుమానాలు

కడివెడు కష్టాలతో 'వానకాలాన్ని' ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుంటున్న కొత్తగూడెం జిల్లా కర్షకులకు ఇప్పుడు యాసంగి సీజన్ మరో పెద్ద గండంగా కన్పిస్తోంది. ఒకవైపు సర్కారు మోసం, మరోవైపు ప్రకృతి ప్రకోపం వంటి కారణాలతో కొట్టుమిట్టాడుతూ వచ్చిన కర్షకులను ముమ్ముందు మరిన్ని కష్టాలు వెంటాడే ప్రమాదాలు కన్పిస్తున్నాయి. ఈసారి వెయ్యి ఎకరాలకు పైగానే పంటల సాగు విస్తీర్ణం తగ్గే అవకాశముందంటూ సాక్షాత్తూ సర్కారు యాసంగి ప్రణాళికే చెబుతుండడం ఇందుకు అద్దం పడుతోంది. వానకాలంలో సాగుకు ముందే ఇవ్వాల్సిన రైతుభరోసాను సీజన్ ముగిసినా ఇవ్వకపోవడం, రుణమాఫీని సక్రమంగా చేయకపోవడం, ప్రకృతి విపత్తుల సమయంలో అన్నదాతలను కనీసం ఆదుకోకపోవడం, సన్నాలకు బోనస్ ఇస్తామంటూ చెప్పి మోసం చేయడం, చివరికి కొనుగోలు కేంద్రాలనూ ఏర్పాటుచేయకపోవడం వంటి కారణాలతో అన్నదాతలు యాసంగివైపు మొగ్గు చూపేందుకు జంకుతున్నారు. దీనికితోడు యాసంగికైనా పెట్టుబడి సాయం అందుతుందో లేదోనన్న సందేహాలు వెంటాడుతుండడం, కొన్నిచోట్ల పంటకు సరిపడినన్ని సాగునీళ్లు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలు కూడా తోడవుతున్నాయి.

యాసంగైనా సాగేనా?

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఈ వానకాలం సీజన్‌లో అన్నదాతలు అతలాకుతలమయ్యారు. సీజన్ ప్రారంభంలో సరైన సమయానికి వర్షాలు కురవలేదు. సుమారు రెండు నెలలు ఆలస్యంగా కురిశాయి. దీంతో కాలం ఆ మేరకు వెనుకగా కొనసాగుతోంది. తీరా పంటలు చేతికి వచ్చే సమయానికి అతిభారీ వర్షాలు ముంచెత్తాయి. కొన్ని చోట్ల పంటలు మొత్తానికి కొట్టుకుపోయాయి. ఎంత నష్టం వాటిల్లినా ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ అందిన పాపానపోలేదు. కాస్తోకూస్తో బతికిన పంటలు చేతికి రావాలన్నా ప్రస్తుతం కొంతైనా వర్షపాతం ఉండాలి. కానీ ప్రస్తుతం అది కూడా లేదు. దీంతో పొట్టదశలో ఉన్న పంటలు చాలాచోట్ల ఎండిపోతున్నాయి. సీతారామ ప్రాజెక్టుపై గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం దాని కాలువ నుంచి కనీసం చుక్కనీటినైనా అందించలేదు. కొన్నిచోట్ల చెరువులు కూడా అడుగంటుతున్నాయి. ఇక గండి పడిన కారణంగా పెదవాగులో చుక్క నీరు కూడా లేదు. దీంతో దాని ఆయకట్టు కింద ఈ యాసంగి సాగు ప్రశ్నార్థకంగానే కన్పిస్తోంది.

బ్యాంకుల చుట్టూ తిరిగీతిరిగీ..

వానకాలం సాగు పనుల్లో నిమగ్నం కావాల్సిన కర్షకులందరినీ రుణమాఫీ పేరిట ముప్పుతిప్పలు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం. హామీ ఇచ్చినట్లుగానే అందరికీ రుణమాఫీ చేయకపోవడంతో అర్హులందరూ బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. దీంతో పంటలను పట్టించుకునే అవకాశం లేకపోవడంతో పలు చోట్ల పంటలు తెగుళ్ల భారిన పడ్డాయి. అది కూడా అన్నదాతలకే పెద్ద నష్టాన్నే మిగిల్చింది.

కదలికలేని కొనుగోలు కేంద్రాలు..

మరోవైపు వానకాలం పంటల కోసం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై పెద్దగా కదలిక కన్పించడం లేదు. ఇప్పటి వరకూ ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చేసిన దాఖలాలు లేవు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలంటూ ఇటీవలి సమీక్షలో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ తరువాత దాని ప్రస్తావననే పక్కనపెట్టేశారు. అంతకు ముందు వానకాలం పంటకు బోనస్ విషయంలోనూ అలాగే చేశారు. వీటికితోడు కొన్ని చోట్ల చెరువుల్లో సరిపడినన్ని నీళ్లు లేకపోవడం, బోర్లలో కూడా నీరు ఉంటుందో లేదో అంతుబట్టకపోవడం వంటి కారణాలు కూడా అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో యాసంగిపై వారు వెనక్కు తగ్గే అవకాశాలు కన్పిస్తున్నాయి.

యాక్షన్‌ప్లాన్‌లో తగ్గిన విస్తీర్ణం..

నిరుటి యాసంగిలో జిల్లాలో 62 వేల ఎకరాల్లో అన్నదాతలు వరి పంటను సాగు చేశారు. అయితే ఈసారి 60,927 ఎకరాల్లోనే వరి సాగుచేసే అవకాశం ఉందంటూ అధికారులు లెక్కలు వేసుకున్నారు. కానీ క్షేత్రస్థాయిలో రైతులు అంతకంటే తక్కువ విస్తీర్ణంలోనే వరిని సాగు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. వరిని 60,927 ఎకరాల్లో, జొన్నను 1,230 ఎకరాల్లో, మొక్కజొన్నను 19,731 ఎకరాల్లో కలిపి మొత్తంగా ఈ యాసంగిలో జిల్లాలో 81, 888 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశమున్నట్లు అధికారులు యాక్షన్ ప్లాన్ సాగును చేయనున్నారు. దీంతో గత యాసంగితో పోల్చితే ప్రస్తుతం యాసంగిలో పంటల విస్తీర్ణం తగ్గే అవకాశం కన్పిస్తోంది.

దుమ్ముగూడెం మండలంలో ఇంకా పొట్టదశకు రాని వానకాలం వరి పంట

పెదవాగు ఆయకట్టు కింద ఇసుక మేట వేసిన వరి పొలం (ఫైల్)

వానలు ఆలస్యమయ్యాయి.. తెగుళ్లు సోకాయి..

ఈ వానకాలం మాలాంటి రైతులను ఎంతో దెబ్బతీసింది. రుణమాఫీల కోసం తిరిగే క్రమంలో మా వరి పంటకు తెగుళ్లు సోకాయి. ఇప్పుడు పంట చేతికొస్తుందా? రాదా? అనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఇంకోవైపు సాగునీరు కూడా సరిపడినంతగా లేదు. పక్కనే గోదావరి ఉన్నా సాగుకు అందే పరిస్థితి లేదు. పంట కాలువలు కూడా లేవు. చెరువులు నిండితే తప్ప నీరు ఉండదు. బోర్ల మీద ఆధారపడిన వారు మాత్రమే వరి పంట వేస్తారు.

–కాసిబోయిన సతీశ్, రైతు, చినబండిరేవు

బ్యాంకుల చుట్టూ తిరగడమే సరిపోతుంది..

రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరగడమే సరిపోతుంది. ఇక పంట వేస్తే ఎవరు చూడాలి? అసలే వర్షాలు, చెరువులు మీద ఆధారపడుతున్న సమయం. ఈ సమయంలో అటు తిరుగుతూ ఇటు పంటలను కాపాడుకోవాలంటే చాలా కష్టమవుతోంది. చివరికి వానకాలం ముగిసినా రైతుభరోసా ఇవ్వలేదు. ఇప్పుడు యాసంగి వేయాలా? వద్దా? అని చూస్తున్నాం. ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు. అందువల్ల ప్రైవేటులోనే విక్రయిస్తున్నాం.

–లావుడ్యా సత్యనారాయణ, రైతు, సీతంపేట బంజర

- డిస్పెన్సరీకి వచ్చే కార్మికుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- రాష్ట్ర లేబర్ ఎంప్లాయిమెంట్ విభాగ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్
- సారపాకలోని ఈఎస్ఐ ఆసుపత్రి సందర్శన.. వైద్య సేవలపై ఆరా..

మందులు అందుబాటులో ఉంచాలి

సారపాక, అక్టోబర్ 6: డిస్పెన్సరీకి వచ్చే కార్మికుల ఆరోగ్య విషయంలో వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర లేబర్ ఎంప్లాయ్‌మెంట్, ట్రైనింగ్, ఫ్యాక్టరీస్ విభాగ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ సూచించారు. కార్మికులకు అవసరమైన అన్ని రకాల మందులను డిస్పెన్సరీలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలోని ఈఎస్ఐ ఆసుపత్రిని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీకి వరంగల్ జాయింట్ డైరెక్టర్ హేమలత, ఈఎస్ఐ వైద్యులు బి.చందు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఈఎస్ఐ ఆసుపత్రిలో కార్మికులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీతోపాటు పలు కార్మిక సంఘాల నాయకులు డిస్పెన్సరీకి చేరుకున్నారు. పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సారపాకలో ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడంతో జిల్లాలోని సుమారు 30 వేల మందికి పైగా కార్మికులు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. కలెక్టర్, ఐటీసీ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. తొలుత ఐటీసీ హెచ్‌ఆర్ హెడ్ శ్యాంకిరణ్, ఆయా కార్మిక సంఘాల బాధ్యులు ఇక్కడి ఐటీసీ అతిథిగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

సారపాకలోని ఈఎస్ఐ ఆసుపత్రిని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్

ఖమ్మంలో మోస్తరు వర్షం

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 6: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం ఆదివారం ఖమ్మంజిల్లాలో కనపడింది. ఉదయం నుంచి మేఘాలు అలుముకోవడంతో వాతావరణం చల్లబడింది. బతుకమ్మ పండుగ ఐదోరోజు, దేవీనవరాత్రుల నాలుగో రోజును పురస్కరించుకొని సాయంత్రం వేళ అమ్మవారి మండపాల వద్దకు మహిళలు బతుకమ్మలు తీసుకొచ్చే సమయానికి ఖమ్మం నగరంలో ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దాదాపు 30 నిమిషాలపాటు నగరంలో చెదురుమదురు జల్లులతో కూడిన వర్షం కురవడంతో ద్విచక్ర వాహనదారులు స్వల్ప ఇబ్బందులకు గురయ్యారు. అల్ప పీడనం ప్రభావం ఆంధ్రా, తెలంగాణలో స్పష్టంగా ఉంటుందని, రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. మళ్లీ వర్షాలు కురిస్తే పత్తి, వరి పంట పొలాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు, వరదలకు పోను మిగిలిన కొద్దిపాటి పంటలను కాపాడుకునేందుకు రైతులు గత కొద్దిరోజుల నుంచి మిర్చి, పత్తి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. మరోమారు వర్షాలు పడే అవకాశం ఉందని ప్రకటనలు విడుదలకావడంతో సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.

ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం

అందాలా బతుకమ్మా.. రావే..

ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయం వద్ద అట్ల బతుకమ్మలతో ఆడబిడ్డలు

టీఎన్‌జీవోస్ ఆఫీసులో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

బతుకమ్మకు పూజలు చేస్తున్న టీఎన్‌జీవోలు

ఖమ్మం తెలంగాణ భవన్‌లో..

తెలంగాణ భవన్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఉమ్మడి జిల్లాలో ఐదో రోజూ కొనసాగిన పూలపండుగ

వాడవాడలా అట్ల బతుకమ్మలతో ఆడిపాడిన ఆడబిడ్డలు

'ఆ సింగిడిలో రంగులనే దూసి తెచ్చి.. తెల్ల చంద్రుడిలో వెన్నులలే తీసుకొచ్చి..' అంటూ ఆడబిడ్డలంతా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక పండుగకు వన్నె తెచ్చారు. ప్రకృతిని పూజించే పూల పండుగ ఉమ్మడి జిల్లాలో ఐదో రోజు ఆదివారమూ ఘనంగా కొనసాగింది. ఐదో రోజు అట్ల బతుకమ్మతో ఆడబిడ్డలందరూ వాడవాడలా సందడి చేశారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో బతుకమ్మ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు అట్ల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. 'అందాలా బతుకమ్మా.. రావే..' అంటూ ఆడబిడ్డలు కోలాట నృత్యాలు ప్రదర్శించారు. అలాగే, కలెక్టర్ ఆదేశాల మేరకు టీఎన్‌జీవోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లోనూ బతుకమ్మ వేడుకలు జరిగాయి. కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, టీజీఈజేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్‌జీవోస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

-ఖమ్మం, అక్టోబర్ 6

బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మకు హారతి పట్టే పూజల్లో పాల్గొన్న కొండబాల, మహిళా నేతలు